# వాళ్ళు




అర్థరాత్రి ఎప్పుడేనా నడుస్తుంటే, ఆ ఆలోచన నన్ను తినేస్తుంది.

అందులో సరిగ్గా అక్కడ మా సన్నటి సందు పెద్ద వీధిలో కలిసే మలుపు దగ్గర.... కొత్తగా కడుతున్న పెద్ద బిల్డింగు అరుగు మీద....

అర్థరాత్రి పన్నెండు దాటిన ఆ సమయంలో ఏం కనిపించదు. అరుగు చీకట్లో స్ట్రీట్ లైట్ సన్నటి వెలుతురుచేతులు తారట్లాడుతుంటాయి. వాటి తారట్లాట మధ్య అరుగు మీద ఇనప చువ్వల్లా నిగడదన్నిన మందపాటి గొంగళీ ముసుగులే కనిపిస్తాయి.

కాని.... నాకు ఆ చీకటి చీలిపోతూ.... ఆ ముసుగుల లోపల.... మందపాటి ఆ గొంగళీల లోలోపల ఆకారాలు కనిపిస్తాయి.... ఆ బలం నా చూపుల్ది కాదు.... నన్ను తింటున్న ఆలోచనది....

ఎప్పుడో సరిగ్గా గుర్తులేదు. ఇంచుమించు ఓ నెలక్రితం చూశాను తనని..... పొద్దున్నే.... ఇంకా ఏడు కూడా కాలేదు..... సూర్యుడి పల్చటి వెలుగు మెత్తటి సూదుల్లా ఆ అరుగు. అంచుల్ని తాకుతోందప్పుడు.

చేతులకున్న దంతం గాజులు చప్పుడయ్యేలా.... రెండు చేతులు పైకెత్తి.... తలమీద దుప్పటీ లాంటి ఎర్రటి ముసుగుని సవరించుకొంటూంది తను.... సూర్యుడి సన్నటి చూపు తన ముక్కుమీద సిల్వర్ నత్తులో మెరిసింది. అంతకన్నా అందంగా మెరిశాయి తన కళ్ళు. ఏం గుర్తు వచ్చిందో ఏమో వెలుగుని చూస్తూ ఫక్కుమని నవ్వుకుంది తను.... రెండు బుగ్గల్లోను లోతుగా అందం గుంటలు పడింది. గుండె మీద పూసలు ఎత్తుగా స్వేచ్ఛగా ఎగిరిపడ్డాయి.

ఇవన్నీ కనపడలేదు నాకప్పుడు.... వీటిలో ఏదో ఒకటి కనిపించింది అన్నీ స్ఫురించేలా.

తనని చూడాలంటే మొత్తం అరుగు మీద గుంపు నంతీటినీ వెతకవలసి వచ్చేది. మరీ పొద్దున్న కొద్దిసేపు తప్ప పగలంతా కనపడేది కాదు. తనే కాదు, గుంపులో ఎవరూ కనపడరు. మళ్లీ సాయంత్రం చీకట్లు తరిమేటప్పుడు కనపడేది కాస్సేపు.... అందుకనే నాకు తను.... తనతోపాటు వాళ్లూ చీకట్లో కూడా గుర్తే.

ఇళ్లలో పోర్షన్స్‌లా, గుంపులో జట్లున్నాయి. తనెప్పుడూ వాడితోటే కనపడేది. బాగా సాగదీసిన రాగితీగలా ఎర్రగా ఉండేవాడు. ఎవరో పిలిచినప్పుడు విన్నాను, పేరు లచ్చుమయ్యట.... వాడి జుట్టు కూడా రాగిరంగులోనే ఉండేది. సంవత్సరాలుగా మట్టితట్టలు, ఇటుకలు ఎత్తి నెత్తిమీద మోయటం వల్ల జుట్టు అలా అయిందేమో అనిపించింది. ఒంటిమీద ముతక బనీను... మోకాళ్ల వరకూ పంచ.... చేతికి తెల్లటి కడియం.... ముక్కుకి రాగిపోగు.... తలకి ఎప్పుడూ చుట్టుకునే ఎర్రగళ్ల సన్నగుడ్డ.... తలపాగాలో ఆకుచుట్ట.... తన పక్కన గమ్మత్తుగా ఉండేవాడు.... తనని వాడు చూస్తుంటే ఎంతో ప్రేమగా ఉండేది.

మా వీధిలో ఎన్నోరకాల ఇళ్లున్నాయి. అంతకన్నా ఎన్నోరకాల మనుషులున్నారు. కాని దీనికి సంబంధించినంతవరకు అరుక్కి ఎదురుగా ఉండే మేడ గురించే చెప్పుకోవాలి. అందులో ఎవరో అమెరికన్స్ ఉంటున్నారు. సాయంత్రం పూట పద్దెనిమిదేళ్ల వాళ్ల పిల్ల స్కర్ట్‌లో బిగుతుగా, తెల్ల గోధుంగింజలా ఆరోగ్యాన్ని పిటపిటలాడిస్తూ పచార్లు చేస్తూంటుంది. కాలుస్తున్న సిగరెట్ నుసితోపాటుగా, చూపుల్ని కూడా కింద అరుగు వేపు రాలుస్తూ ఉంటుంది. ఆ మేడ గురించి చెప్పుకోవటం రవి గురించే

రవి బొమ్మలు వేస్తాడు. అందాన్ని గీస్తానంటాడు. వాడు చూశాడొకసారి అరుగు మీద తనని.

"పూసల్లో, కడియాల్లో ఈ లంబాడీ వాళ్లని చూస్తుంటే పిచ్చెక్కుతుంది, తెలుసా?" అన్నాడు.

రవి ఎప్పుడూ తనొక్కదాన్నే చూసేవాడు. గుంపుని చూసేవాడు కాదు. కాని నాకు తనతోపాటు గుంపుని కూడా చూడడం అలవాటయింది. ఆ అరుగు మీద ఆ గుంపునే కాదు, ఇంకా చాలా అరుగుల మీద.... చాలా గుంపుల్ని....

సిటీలో చాలాచోట్ల కొత్తగా కడుతున్న బిల్డింగుల దగ్గిరరాళ్లు మోస్తూనో, నీళ్లు మోస్తూనో, సిమెంటు కలుపుతూనో కనపడేవాళ్లు. వాళ్లలో వాళ్లుకాక, బయటి వాళ్లెవరితోనూ కలివిడిగా మాట్లాడుతూ ఏనాడూ కనపడలేదు.

ఇంత హడావిడిగా ఒకళ్లనొకళ్లు ఒరుసుకుంటూ గడిపే నగరజీవితంలో కేవలం వాళ్ల వరకే

వాళ్లు అడివిలో ఉండే ఓ తెగలా కాలం గడుపుతూ వీళ్లు ఒక్కళ్లే కనిపిస్తారు.

పగలంతా ఎండలోనూ, దుమ్ములోనూ గొడ్ల గుంపులా పనిచేయటం... రాత్రి కాగానే అరుగుల పక్కన ఎర్రటి మంటల ముందు ఆనందాన్ని తుళ్లుతూ నవ్వుతూ పంచుకోవటం.... అది వాళ్ళ జీవితం. అందరూ కష్టపడతారు. కలిసి తింటారు. అందుకనే ఆనందం వాళ్లది. వాళ్ల తీరువేరు. వాళ్లు వేరు. వాళ్ల భాష వేరు.

"ఈ ఆడాళ్ల దగ్గిర దారుణమైన రోగాలుంటాయట, నీకు తెలుసా?" అన్నాడు రవి ఇంకోనాడు.

ఈ మాట నేనూ విన్నాను చాలాసార్లు. కష్టపడే బలమైన ఆ శరీరాల్లో రోగాలునిలవలేవు... కాని వాళ్లలో ఉన్న అమాయికత్వం చుట్టూ కమ్ముకున్నాయి రోగాలు. వంశానుగతంగా వచ్చే రోగాలుంటాయని, వాటిని బాగు చేసుకోవటానికి మందులుంటాయని తెలియని వాళ్ల అజ్ఞానం తలుచుకున్నప్పుడల్లా వీళ్లు నలుగురితోనూ అందరిలాగే కలిసిపోతే బాగుండుననిపిస్తుంది.

ఇదివరకు లచ్చుమయ్య తండ్రి మట్టి మోసి ఉంటాడు. ఇప్పుడు లచ్చుమయ్య మోస్తున్నాడు. రేపు లచ్చుమయ్య కొడుకు ఇంతేనా....

"ఏదేనా రూము చూడకూడదు ఖాళీగా...." అన్నాడు రవి ఈమధ్యన.

"ఎందుకు?" అంటే అయిదు రూపాయిలిచ్చి తనని తీసుకెళ్లటానికన్నాడు.... న్యూడ్ ఫోజ్ కోసం.... మోడల్‌గా....

అరుగుకి ఎదురుగా ఉన్న అమెరికన్ అమ్మాయి మీదికెందుకు పోలేదో రవి దృష్టి, కేవలం తన వేపే ఎందుకు మొగ్గిందో అనిపించింది నాకు.

గుంపులో మిగిలిన మగాళ్లందరిలా ఉండేవాడు కాదు లచ్చుమయ్య...... పని లేనప్పుడు మిగిలినవాళ్లు బద్ధకంగా దొర్లుతూనో, లేకపోతే రాగితీగల తుట్టలా ఉండే తలలో, ఆడాళ్లచేత పేలు చూపించుకుంటూనో ఉండేవారు. లచ్చుమయ్య మటుకు అరుగు చివర కూచుని ఆకాశంలోకి, వెలుగులోకి చూస్తూ ఏదో ఆలోచిస్తూండేవాడు.

ఒకసారి వీధి చివర రిక్షావాడితో మాట్లాడుతూ కనిపించాడు. వాళ్లని దాటుతూ వెళ్లిపోతుంటే ఆ ఒక్క మాట వినిపించింది నాకు.

"అయితే ఆరురోజులు రిక్షా తొక్కితే.... ఏడో రోజు కిరాయి లేదా రిక్షాకి...." అంటున్నాడు గొప్ప అద్భుతంలా ఆశ్చర్యపోతూ లచ్చుమయ్య.

రిక్షావాడు వాడి ఆశ్చర్యానికి ఫక్కుమని నవ్వాడు.

అవును, లచ్చుమయ్యకేం తెలుసు, ఆరు రోజులు శ్రమించినవాడికి వారంలో ఏడోరోజు సెలవుండాలని. రోజంతా పనిచేసి కూలి తీసుకోవటమే కాక, ఆ కూలీ విధానాన్ని కాపాడే రూల్సున్నాయని, వాటికి కూడా కోర్టులు, మోసాలు, లంచాలు అన్నీ యథావిధిగా ఉన్నాయని వాడికేం తెలుసు?

వాళ్ల గుంపులో తెలిసిందొక్కటే. పని దొరకని రోజు బద్ధకంగా అరుగుమీద దొర్లటమే సెలవు. దానికి ఓ గడువు లేదు. ఒక్కోసారి నెలల తరబడి ఉండకపోవచ్చు. మరోసారి వారానికి రెండు మూడురోజులు రావచ్చు.

మరో నెల గడిచింది.

అరుగు కెదురుగా మేడ టెర్రెస్ మీద అమెరికనమ్మాయి సాయంత్రం పూట పచార్లు చేస్తూ

సిగరెట్లు కాలుస్తూనే ఉంది.

ఇదివరకంతగా కాకపోయినా అర్ధరాత్రుల్లు ఆ ఆలోచన నన్ను తింటూనే ఉంది.

కాని లచ్చుమయ్యే ఎక్కువగా రిక్షా వాడితో కనిపిస్తున్నాడు ఈమధ్య.

ఓరోజు నేననుకున్నంతా అయింది. బస్సుకోసం ఎదురుచూస్తూ నిలబడ్డాను నేను.

ఎదురుగా రిక్షా తొక్కుకుంటూ వస్తున్నాడు లచ్చుమయ్య. రిక్షాలో మనుషులున్నారు. హుషారుగా తొక్కుతున్నాడు. నన్ను చూసి చిన్నగా నవ్వాడు. గర్వంగా ఉంది ఆ నవ్వు. అందులో ఉత్సాహం ఉంది; కలుపుగోరుతనం ఉంది.

ఆ నవ్వుని అందరూ గుర్తుపట్టగలరు. దృష్టి ఉంటే.... ఆ మార్పు అందరికీ తెలుస్తుంది. జీవితం సంఘంలో పొందుతున్న మార్పది. ఇంకా ఎంతో తొందరగా అందరిలోనూ రావలసిన మార్పది.

కేవలం కూలిచేసుకునే ఓ లంబాడీ వాడు రిక్షావాడుగా మారటమే కాదు, ఓ తెగ కొత్త జీవితానికి నాంది కావచ్చు అది. ముందుకు సాగినవాడు, వెనకబడిన వాడికి అందివ్వవలసిన విజ్ఞానాన్ని జీవితమే అందిస్తున్న తీరు కావచ్చది.

లచ్చుమయ్య రిక్షా నన్ను దాటుకు వెళ్లిపోయింది. కాని నా ఆలోచన నాలో కదులుతూనే ఉంది. లచ్చుమయ్యకి కూడా ఇంక చాలామందిలాగే వారంలో ఏదోరోజు సెలవుంటుంది. నెమ్మదిగా అరుగు బతుకు మానేసి తనతో ఏదో చిన్న గుడిసెలోకి మారిపోతాడు.

తను రోజూ సాయంత్రం వాడి కోసం పొద్దుటి నుంచి వాడితో చెప్పాలనుకున్న ఊసులన్నీ మనసులో చోటుచాలక, గుండెలమీద పూసల్ని ఎగరేస్తుంటే, సంజెచీకట్లతో వాడి రాకకోసం గుడిసె గుమ్మం దగ్గర ఎదురుచూస్తూ....

లచ్చుమయ్య ఆ అరుగు మీద ఆ తెగవాళ్లందరి బ్రతుకుల్ని తన రిక్షాలో వేసుకుని, వాళ్లకి దూరంగా ఉన్న సంఘంలోకి తీసుకువెళ్లి నలుగురితో పెనవేస్తాడు.

తను లచ్చుమయ్యతో ఏ అరుగు నీడనో కాకుండా, ఓ గుడిసె కప్పు కింద బతికితే రవి దృష్టి తనని నగ్నంగా నిలబెట్టడానికి అయిదు రూపాయల విలవే కట్టదింక....

తను అక్కడ లేకపోతే నా దృష్టికి ఆ అరుగు ఖాళీగా కనిపించి, యౌవనం ఒళ్లు విరుచుకుంటూ పిరికిగా, నీచంగా తనని ఆలంబన చేసుకున్న ఆ ఆలోచన నన్ను తినదింక!....

• *ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, ఉగాది ప్రత్యేక సంచిక, 15-4-1970*